తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పశు బీమా పోస్టర్లను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం



చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

పాడి రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ పశు బీమా పథకంను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ సిఎం నారాయణస్వామి పేర్కొన్నారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం పశు బీమా పోస్టర్లను డిప్యూటీ సిఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి, ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్‌లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, రాయలసీమ ఐసిడిఎస్ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి ప్రభాకర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యకు నిరుపేద తలరాత మార్చే శక్తి

### - డిప్యూటీ సిఎం నారాయణస్వామి



జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం నారాయణస్వామి

చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:

నిరుపేద తలరాత మార్చే శక్తి విద్యకు వుందని, విద్య సమాజంలోని అంటరానితనంను పోగొట్టి సమానత్వంను ఏర్పరుస్తుందని డిప్యూటీ సిఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి పేర్కొన్నారు. చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో శనివారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా టెన్త్, ఇంటర్మీడియేట్‌లో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు డిప్యూటీ సిఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్‌లు నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ ప్రతి నిరుపేద పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి ఉన్నత స్థానాలు చేరుకోవాలని సిఎం వైఎస్ జగన్ ఆకాంక్ష అన్నారు. ఒక్క పేదరికంను అర్హతగా తీసుకొని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, పార్టీలకు అతీతంగా పథకాలను అందిస్తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలో టెన్త్ పరీక్షల్లో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు 15, 10, 5 వేల రూపాయల నగదుతో పాటు మెరిట్ సర్టిఫికేట్, మెడల్, మెమొంటోలతో పిల్లల తల్లిదండ్రులను సన్మానిస్తున్నామన్నారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి కుటుంబంను సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదుకొంటున్నారన్నారు. పెత్తందారీ వ్యవస్థకు మంగళం పాడటానికి అందుకోసం విద్యకు పెద్దపీట వేసి ప్రతి పేదవాడి పిల్లవాడి చదువు కోసం ఎంతైనా ఖర్చు చేయడానికి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధంగా వున్నారన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని, టెన్త్ అనంతరం విద్యార్థులు తీసుకొనే నిర్ణయం వారి భవిష్యత్తును నిర్ధేశిస్తుందన్నారు. టెన్త్ అనంతరం విద్యార్థులకు వుండే 2 సంవత్సరాలు వారి జీవితంలో ముఖ్య అంకమన్నారు. ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు టెన్త్ అనంతరం మంచి భవిష్యత్తు కోసం సరైన నిర్ణయం తీసుకొని ముందడుగు వేయాలన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉతన్న శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, రాయలసీమ ఐసిడిఎస్ జోనల్ ఛైర్మన్ శైలజారెడ్డి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఎపిసి వెంకటరమణారెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ డిడి రాజ్యలక్ష్మీ, బిసీ వెల్ఫేర్ డిడి రబ్బానీభాషా, ట్రైబల్ వెల్ఫేర్ డిడి మూర్తి, గురుకుల పాఠశాల డిసిఓ జయభారతి తదితరులు పాల్గొన్నారు.

# పేరుకే అగ్నిమాపక కేంద్రం



**-తిరుపతిలో అరకొర వాహనాలతో ప్రమాదాలు నియంత్రించలేని దుస్థితి**

**-మినీఅగ్నిమాపక కేకంద్రాల ప్రతిపాదనలు కాగితాల్లోనే!?**

ప్రభాతవార్త-తిరుపతి:

"చేతులు కాలాక ఆకులుపట్టుకున్న"చందంగా తిరుపతి యాత్రాస్థలంలో...విస్తరించిన నగర పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు సంభవించినపుడు సకాలంలో సేవలందించడంలో అగ్నిమాపక కేంద్ర పనితీరు తయారైంది. రోజురోజుకు విస్తరిస్తున్న నగరం, శివారు కాలనీలు....2లక్షలమంది జనాభా నుంచి నేడు ఏకంగా ఆరులక్షలకు పైగా చేరిన జనాభా.....ఆకాశాన్నంటే అపార్టు మెంట్లు.... ఐదారుఅంతస్థుల హోటళ్ళు భవనాలు.....దుకాణాలు,వ్యాపార సముదాయాలు తీసికట్టుగా తయారైన అగ్నిప్రమాదాల నివారణ చర్యలు వంటివి ఇప్పుడు తిరుపతి జిల్లాకేంద్రంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం తీరును తెలియజేస్తుంది. రెండు దశాబ్ధాలక్రిందటే తిరుపతి యాత్రా స్థలం...విస్తరించిన నగర సంస్కృతి, యాత్రికుల రద్దీని బట్టి తిరుపతిలో ఉన్న ఒకే ఒక అగ్నిమాపక కేంద్రం,రెండు అగ్నిమాపక వాహనాలు సేవలకు సరిపోవని, అత్యవసర సమయాల్లో తిరుపతి పరిసరాల్లోని చంద్రగిరి, రేణిగుంట, ఆర్‌సిపురం, వడమాలపేట,తిరుపతి రూరల్, మంగళం, కరకంబాడి ప్రాంతాలకు అగ్నిమాపక వాహనాలు ప్రమాదకర పరిస్థితుల్లో చేరుకోవాలంటే ప్రమాదం జరిగి మొత్తం బూడిదై పోతోంది. అంతేగాక తిరుపతికి వచ్చే ప్రముఖులు వెంట ఈ వాహనం వెళ్ళాల్సి ఉంది. చాలీచాలని వాహనాలు కష్టాలుమయం. ఇలాంటి పరిస్థితుల్లో తిరుపతి నగర శివార్లలోని మంగళం, రేణిగుంట,చంద్రగిరి కేంద్రాల్లో మినీ అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటుచేయాలని దాదాపు 20సంవత్సరాల క్రిందట అప్పటి ప్రభుత్వాలకు తిరుపతి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అప్పట్లోనే తిరుపతి యాత్రాస్థలం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని మరిన్ని అగ్నిమాపక వాహనాలు అవసరాన్ని గుర్తించారు. అయితే అప్పట్లోనే ప్రభుత్వాలు ఈ కాగితాలను చెత్తబుట్టలోకి పడేశారు. ఈ నేపథ్యంలో తాజాగా శుక్రవారం ఉదయం తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం సమీపంలో ఉత్తరమాఢవీధిలో లావణ్యఫోటోఫ్రేమ్స్ దుకాణం భవనాలు అగ్నిప్రమాదం జరిగి భారీ మంటలు వ్యాపించాయి. ఈ మంటలను సకాలంలో ఆర్పివేయడంలో తిరుపతిలో ఉన్న అగ్నిమాపక వాహనాల సామర్థ్యం సరిపోలేదు. మంటలను అదుపుచేయడానికి చివరకు పాకాల, పుత్తూరు, శ్రీకాళహస్తి ,తిరుమల ప్రాంతాల్లోని అగ్నిమాపక వాహనాలు రప్పించుకున్నారు. ఏకంగా ఏడు వాహనాలు మంటలు అదుపుచేసినా సాయంత్రం 4గంటల వరకు శ్రమించాల్సి వచ్చింది. తిరుపతి నగరపాలకసంస్థకు ప్రత్యేకంగా అగ్నిమాపక వాహనం లేకపోవడం, తిరుపతిలో ఉన్న ప్రభుత్వ అగ్నిమాపక కేంద్రంలోని వాహనాలు సామర్థ్యం లేకపోవడం, ఉన్న వాటికి నీటిట్యూబ్‌లు చిల్లులుపడినవిగా ఉండటంతో ఓ దశలో చేతులెత్తేయాల్సి వచ్చింది. ఇప్పటికైనా ప్రభుత్వం తిరుపతికి మినీ అగ్నిమాపక కేంద్రాలు ఏర్పాటు, వాహనాల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

## ఎంత పనిచేసింది తల్లి!

### భర్తతోనే వివాదాలు: మనస్పర్థలు



ఆస్పత్రి వద్ద మృతురాలి తల్లి, కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త

'ప్రేమించి మనువాడాడు.కానీ ఎంతో కాలం సఖ్యతగా ఉండలేదు. మనువాడిన కొంత కాలం నుంచే ఇద్దరి మధ్య సఖ్యత కుదరలేదు. మనస్పర్థలు రోజు రోజుకు పెరిగాయని శుక్రవారం ఉరికి బలి అయిన శివమ్మ తల్లి నాగమ్మ తమ్ముడు పవన్, చెల్లి నరసమ్మలు వాపోయారు. శుక్రవారం శ్రీకాళహస్తికి సమీపంలోని ఈదుల గుంట కాలనీలో 26 సంవత్సరాల యువతి శివమ్మ తన ఇద్దరు మగబిడ్డలను ఉరికి తగిలించి తాను వేలాడిన సంఘటన తెలిసిందే.అయితే ఈ సంఘటనకు సంబంధించి భర్త శివయ్యను (28) టూటౌన్ పోలీసులు అదుపులో తీసుకొని వివాదాలకు సంబంధించి విచారిస్తున్నారు.

**పోస్టుమార్టం:**

శుక్రవారం ఉదయం ఇంటిలో ఉరేసుకున్న శివమ్మ (26), రోహిత్ ఈశ్వర్ అలియాస్ రోహిత్ (3),దేవాన్ష్ (10నెలలు) మృత దేహాలకు శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. మృతుల బంధువులు కొత్తచెరువు నుంచి రావటం బాగా రాత్రి కావటంతో శనివారం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్ఐ మహేష్‌బాబు, కానిస్టేబుల్ చటర్జీలు పంచనామా జరిపారు. పోస్టుమార్టం జరిపి శవాలను తల్లి నాగమ్మకు అప్పగించారు. మృతదేహాలను తమ సొంత ఊరుకు తీసుకెళ్లె స్థోమత లేకుండా ఇక్కడే దహన కార్యక్రమాలు నిర్వహించారు. కేసు విచారణలో ఉంది.

## కార్పొరేట్ విద్య కన్నా ప్రభుత్వ పాఠశాలలో విద్యే మిన్న

**జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పలువురు వక్తలు**



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తిరుపతి కలెక్టరేట్, జూన్ 17, ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చదువే ఆస్తిగా భావించి పేద పిల్లల చదువు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి నాడు నేడు పథకంతో నిధులు ఖర్చు చేయడంతో కార్పొరేట్ విద్య కన్నా ప్రభుత్వ బడులలో చదువుతున్న వారు మంచి ఫలితాలతో పాస్ అవుతున్నారని బోర్డు ఆఫ్ కమ్యూనిటీ డెవలప్మెంట్ త్రూ ఎడ్యుకేషన్ ఆఫ్ ఎపి ఛైర్మన్ ఎన్. రామ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జిల్లా స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఎన్. రామ్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా, జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి, సభాధ్యక్షులుగా, నగర పాలక మేయర్ డాక్టర్ శిరీష 2022 - 2023 విద్య సంవత్సరంలో ఇంటర్ 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన మొదటి 3 ర్యాంకుల సాధించిన వారికి జగనన్న ఆణిముత్యాల బహుమతులు ప్రధానంలో పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి మాట్లాడుతూ విద్యా రంగంలో సంస్కరణలు అమలుతో గత 2 సంవత్సరాలుగా మంచి ఫలితాలు వస్తున్నాయని అందుకు కారణం విద్య రంగంలో సంస్కరణలు అమలు చేయడం, నాడు నేడు అమలు చేసి 10 రకాల సౌకర్యాల కల్పన, మరుగుదొడ్డు నిర్మించి రన్నింగ్ వాటర్ ఏర్పాటు, మంచి వాతావరణం కల్పించడం జరిగిందని అన్నారు. నేడు జగనన్న ఆణిముత్యాలు అందుకుంటున్న విద్యార్థుల తల్లిదండ్రులను చూస్తే వారి కళ్ళలో తమ పిల్లల భవిష్యత్తును చూస్తున్న ఆనందం వారిలో కనిపిస్తున్నదని అన్నారు. నగర పాలక మేయర్ డా. శిరీష మాట్లాడుదారు. జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ స్వాగతోపన్యాసం చేపట్టగా డిప్యూటి ఎడ్యుకేషన్ అధికారులు, ఎంఇలు, జగనన్న ఆణిముత్యాలు అందుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గురువులు పాల్గొన్నారు.



## పక్కాగా పౌరసేవలు

– వార్డు సచివాలయ సిబ్బందికి జడ్పీ సిఇఓ దిశా నిర్దేశం



**చిత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త:** సమస్యలపై వార్డు సచివాలయానికి వచ్చిన పౌరులకు సేవలను పక్కాగా అందించి వారి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ పరిధిలోని వెంగళరావుకాలనీ వార్డు సచివాలయంను శనివారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సిఇఓ సచివాలయంలో డిస్‌ప్లే బోర్డులు, లబ్ధిదారుల అర్హుల జాబితా తదితరాలను పరిశీలించారు. హాజరు పట్టీని పరిశీలించిన జడ్పీ సిఇఓ ఎవరైనా క్యాంపుకు వెళ్తే మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్ళాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంద శాతం వ్యాధి నిరోధక టీకాలు

**యాదమరి, జూన్ 17 ప్రభాతవార్త:** క్షేత్ర స్థాయిలో ప్రజలకు అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలను వంద శాతం వేయాలని యాదమరి పిహెచ్‌సి సిహెచ్ఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. యాదమరి పిహెచ్‌సి పరిధిలోని 70 కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంను సిహెచ్ఓ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతా శిశు మరణాల కట్టడికి ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమంను చేపట్టిందన్నారు. గర్భవతులు, ఐదు సంవత్సరాల చిన్నారులందరికీ వంద శాతం వ్యాధి నిరోధక టీకాలను వేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఆరోగ్య కార్యకర్త గజలక్ష్మీ, ఆశా వర్కర్ సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గడప గడపకు సమస్యల పరిష్కరిస్తాం

– ఎంపిపి శ్యామలా శివప్రకాష్



**పాలసముద్రం, జూన్ 17 ప్రభాతవార్త:** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామని ఎంపిపి శ్యామల శివప్రకాష్ పేర్కొన్నారు. పాలసముద్రం మండల పరిధిలో డిప్యూటీ సిఎం ఆధ్వర్యంలో జడ్పీటీసీ అన్బుగలన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుండి అందిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం లభించే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని, మిగిలిన సమస్యలను త్వరలో పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటామన్నారు. మండల పరిధిలో ఇప్పటికే డిప్యూటీ సిఎం నారాయణస్వామి చొరవతో పలు సిమెంటు రోడ్లు మంజూరు అయ్యాయని, ప్రజల విన్నపం మేరకు మరికొన్ని రోడ్లు మంజూరుకు సిద్ధంగా వున్నాయన్నారు. ప్రజలు ఎదైనా సమస్య ఎదుర్కొంటుంటే వారు ఆ సమస్యను తన దృష్టికి తీసుకువస్తే ఆ సమస్యను పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటానని ఆమె పేర్కొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమానికి సన్నద్ధం కావాలి

–ప్రజలకు పది రకాలు సర్టిఫికేట్స్ ఉచితం –ఎంపిడిఓ వెంకట నారాయణ



**తిరుపతిరూరల్, జూన్17 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, ఇంకా ఏమైన లబ్దిదారులకు పది రకాల సర్టిఫికేట్స్ ఉచితంగా ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తిరుపతిరూరల్ ఎంపిడిఓ వెంకట నారాయణ తెలిపారు. లబ్దిదారులకు మేరుగైన సేవలు అందించటానికే 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 23న ప్రారంభిస్తారని తెలిపారు. జూలై 2 నుండి జగనన్న సురక్ష శిభిరాలను ఏర్పాటు చేసి పది రకాల సర్టిఫికేట్స్‌ను ఉచితంగా అందిచనున్నారని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి లబ్దిదారుల అవసరాలను గుర్తించి, వారికి కావాల్సిన సర్టిఫికేట్స్‌కు పత్రాలు సిద్దం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కుల, నివాస, బర్త్, డెత్, పెళ్లి, ముటేషన్, మ్యుటేషన్ కరెక్సన్, ఫ్యామిలీ నెంబర్స్ సర్టిఫికేట్స్, ఆధార్ లింక్, క్రాప్ కల్టివేషన్ తదితర సర్టిఫికేట్స్‌ను 4 డెస్కులు ఏర్పాటు చేసి అందజేయనున్నారని తెలిపారు. సచివాలయాలు వారీగా శిభిరాలు నిర్వహించే తేదీలను, నిర్వహించే ప్రాంతాల వివరాలను ప్రజలకు వాలంటీర్లు వివరించి, ఆ వివరాలను యాప్ నందు అప్లోడ్ చేయాలన్నారు. అర్హులైన ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా, అవసరయ్యే సర్టిఫికేట్స్‌ను సకాలంలో అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇవో పిఆర్డీ గిరీధర్‌రెడ్డి, పంచాయతీ కార్యధర్శులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

**తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త:** మండలంలోని అరగొండ గ్రామ సమీపంలోని బహుదానది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం ఉదయం చిత్తూరు ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు దాడి చేసి పట్టుకుని సీజ్ చేశారు. బహుదానది నుండి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం రావడంతో దాడిచేసి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలించడానికి డంపింగ్ యార్డు సమీపంలో లోడ్ చేస్తుండగా పట్టుకుని తవణంపల్లె పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఈమేరకు స్థానిక ఎస్సై సుధాకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## తెదేపా మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా జిమ్‌దాము ఎన్నిక



**కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా కౌన్సిలర్ జిమ్‌దామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం కౌన్సిలర్లు సెల్వరాజ్, జాకీర్, సురేష్, జిమ్‌దాము, వేలు, సోమశేఖర్‌లు సమావేశమయ్యారు. రెండురోజుల క్రితం కుప్పంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు బహిరంగసభ సందర్భంగా ప్రోటోకాల్ సమస్య తలెత్తిందన్నారు. ఈనేపథ్యంలో ఫ్లోర్ లీడర్‌గా జిమ్‌దామును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు లిఖిత పూర్వకంగా లేఖను అందించనున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు.

## ఘనంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్

వైస్ ఛైర్మన్ డా॥ సునీల్‌రాజ్ జన్మదిన వేడుకలు



**కుప్పంరూరల్, జూన్ 17 ప్రభాతవార్త** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్ జన్మదిన వేడుకలను శనివారం కుప్పంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్,సిఇఓ సాగర్ రాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు, స్టడీ మెటీరియల్స్ ప్రదానం చేశారు. శెట్టిపల్లి విక్టరీ బధిర పాఠశాలలో పిల్లలకు అన్నదానం జరిపించారు. కార్యక్రమంలో కెఇసి ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, కెడిసి ప్రిన్సిపాల్ సుధారాణి, కెఎన్‌సి ప్రిన్సిపాల్ విమల, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పాడి పశువులకు బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలి

– డి.డి. ఆరీఫుల్లా



**వి.కోట, జూన్ 17 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ ఆరీఫుల్లా కోరారు. శనివారం వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల పశువైద్య సిబ్బందితో ఆయన మాట్లాడారు. రైతులకు పశుబీమా పథకం గురించి రైతులకు వివరించి అవగాహన కల్పించాలన్నారు. పాడి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎడి శ్రీనివాసులు, పశువైద్యులు జయశ్రీ, వెంకటసాయి, సిబ్బంది పాల్గొన్నారు.

## పదిలక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణం - ఎమ్మెల్సీ భరత్



**రామకుప్పం, జూన్ 17 ప్రభాతవార్త** మండలంలోని కొంగనపల్లిలో పది లక్షల రూపాయలతో కొత్తగా డ్రైనేజీ కాలువల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. శనివారం ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటామన్నారు. గడపగడపకు కార్యక్రమంలో వచ్చిన వినతులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి,స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కుప్పం అభివృద్ధిపై బహిరంగకు చర్చకు సిద్ధమా భరత్

– తెదేపా నేతలు



**కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త** కుప్పం అభివృద్ధిపై బహిరంగ చర్చకు ఎమ్మెల్సీ భరత్ సిద్ధమా అని తెదేపా నేతలు ఆర్. చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్, రాజ్‌కుమార్, సాంబశివం, సత్యేంద్రశేఖర్, త్రిలోక్, రామచంద్ర తదితరులు పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెదేపా అధినేత చంద్రబాబునాయుడు గురించి భరత్ చేసిన వ్యాఖ్యలు ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబుఅనుభవం అంత కూడా లేని వయసు గల భరత్ బాబు గురించి మాట్లాడడం భావ్యం కాదన్నారు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే భరత్ రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని ప్రశ్నించారు. వైకాపాకు కుప్పంలో ఈసారి డిపాజిట్లు గల్లంతు అవడం ఖాయమన్నారు. కుప్పంలో నాలుగేళ్లలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వసూళ్ల పర్వం సాగించారే తప్ప మరేం చేశారని ప్రశ్నించారు. కుప్పంలో వైకాపా నేతలు విచ్చలవిడిగా లూటీలు చేస్తున్నారని ఆరోపించారు. కుప్పం రెస్కో రెండు వందల కోట్ల నష్టాల్లో ఉందన్నారు. ఎమ్మెల్సీ భరత్ ఉత్తరకుమారుడి ప్రగల్భాలు పలుకుతున్నారని అసలు వైకాపాలో ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదని చివరకు ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే సందేహం సైతం నెలకొందన్నారు. నాలుగేళ్ల పాలనలో రంగులు వేయడం తప్ప మరేం చేయలేదని, చంద్రబాబు దమ్ము గురించి మాట్లాడే అర్హత భరత్‌కు లేదన్నారు. కుప్పంను చంద్రబాబు ఎలా అభివృద్ధి చేశారో ప్రజలకు తెలుసన్నారు. కుప్పంలో ఈసారి లక్షకు పైగా మెజార్టీ రావడం తథ్యమన్నారు. ఎమ్మెల్సీగా భరత్ ఎన్నికోట్లతో అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కుప్పంకు వచ్చిన 66 కోట్లలో ఎంత అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. ఫ్రస్టేషన్‌లో భరత్ మాట్లాడుతున్నారని ఆయనకు కుప్పం ప్రజలు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వడం తథ్యమన్నారు. సమావేశంలో నేతలు ఆర్ముగం, ఎవి రవి, రాజగోపాల్, రవి, జాకీర్, సుబ్బు, బగ్గిడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## గోసంరక్షణ ట్రస్ట్‌కు లక్ష విరాళం



**కాణిపాకం, జూన్ 17 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శ్రీసిద్ది వినాయక గోసంరక్షణ ట్రస్ట్‌కు ఓ భక్తుడు శనివారం లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఈమేరకు ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన శేఖర్‌బాబు అనే భక్తుడు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమొత్తాన్ని దాత కుటుంబసభ్యులతో కలసి టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్‌కు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భీమా పథకాలతోనే సామాజిక భద్రత

–డీఆర్‌డీఏ పీడీ తులసి



**తవణంపల్లె, జూన్ 17 ప్రభాతవార్త:** భీమా పథకాలతోనే ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత లభిస్తుందని చిత్తూరు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరక్టర్ డిఎంకె తులసి అన్నారు. కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి జీవనబీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన భీమా పథకాలపై దిగువమాఘం ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మండలంలోని దిగువమాఘంలో స్వయం సహాయకసంఘాల సభ్యులకు, బ్యాంకు ఖాతాదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుటుంబ భద్రతను దృష్టిలో వుంచుకుని ప్రధానమంత్రి జీవనభీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన భీమా పథకాలను సత్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఇండియన్ బ్యాంకు జనరల్ మేనేజర్ వెంకటేశన్ మాట్లాడుతూ 18 ఏళ్ళు పైబడి 70 ఏళ్ల లోపు వున్న వారందరూ ప్రధానమంత్రి జీవనభీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన భీమా పథకాలకు ఏడాదిక కేవలం 456 రూపాయలు ప్రీమియంగా చెల్లించి భీమా చేసుకోవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇండియన్ బ్యాంకు జోనల్ మేనేజర్ సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ రాజేష్, చిత్తూరు ఎల్‌డీఎం హరీష్, ఇండియన్ బ్యాంకు అధికారులు,సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు, బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 25న చిట్టమూరుకు లోకేష్ రాక

**చిట్టమూరు, జూన్ 17, ప్రభాతవార్త** ఈ నెల 25న యువగళం పాదయాత్రలో భాగంగా చిట్టమూరు మండలంనకు లోకేష్ రానున్నట్లు గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ తెలిపారు. వారం చిట్టమూరు మండలం పరిధిలోని టిడిపి కన్వీనర్ కిషోర్ నాయుడు నివాసంలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల స్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ అందరు సమక్షంలో లోకేష్ రూట్ మ్యాప్ పై ఉన్నారు. 14 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం జరిగిందని, నాయకులు వారి ద్వారా సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయవంతం చేయడానికి నాయకులు కార్యకర్తలు, పాదయాత్ర కార్యక్రమంలో పాల్గొనాలని పాశం సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా లోకేష్ పాదయాత్రకు ప్రతి ఒక్కరు సైనికులాగ పని చేయాలని సునీల్ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగుంట అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించండి



**వాకాడు, జూన్ 17, ప్రభాతవార్త** చిట్టమూరు మండల పరిధిలోని కొత్త గుంట గ్రామాన్ని అభివృద్ధికి రోడ్డు ఇరువైపులా వ్యాపారస్తులు సహకరించాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు కోరారు. శుక్రవారం గూడూరు శాసన సభ్యులు వరప్రసాద రావు మండల స్థాయి అధికారులతో అంబేద్కర్ విగ్రహం స్థలం, ప్రభుత్వ స్థలం, స్మశాన దారి, ప్రజల కోరిక మేరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధించిన వాటిపై వెంటనే అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు మాట్లాడుతూ కొత్తగుంట అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమించుకున్న వారి ఇష్టాన్ని మేరకు వదిలేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అధికారులు చూసుకోవాలని తెలిపారు. కొత్తగుంట గ్రామంలో కిందకి పడి ఉన్న పాత విద్యుత్ స్తంభాలు తీసి వేసి వెంటనే వాటి స్థానంలో కొత్త స్తంభాలు వేయాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే కోరారు. కొత్తగుంట గ్రామంలో రోడ్డు ఇరువైపుల ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాలకు వ్యారస్తులు అధికారులకు సహకరించాలన్నారు. లేని యెడల అధికారులు తమ పని చేసుకుని పోతారన్నారు. అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన కోరారు. వైకాపా మండల స్థాయి నాయకులు మల్లం సుబ్రమణ్య స్వామి దేవాలయం ఛైర్మన్ సాయిరెడ్డి, తహశీల్దార్ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ సుధీర్, ఎస్ఐ గోపి, వివిధ శాఖ అధికారులు, సుబ్బారెడ్డి, మధుసూధన్ యాదవ్, ఒక నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌డిసిసిబి డైరెక్టర్ రమణయ్యకు పరామర్శ



**కోట, జూన్ 17 ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా ఎన్‌డిసిసిబి డైరెక్టర్ నరమాల వెంకటరమణయ్యను ఎన్‌డిసిసిబి మాజీ వైస్ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించారు. శనివారం కోట మండలం విద్యానగర్‌లో నరమాల వెంకటరమణయ్య నివాసానికి జగన్‌మోహన్‌రెడ్డి వెళ్లారు. రమణయ్య మనవరాలు హర్షిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రమణయ్యను పరామర్శించి, బిటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థిని మృతిచెందడం బాధాకరమన్నారు.

## జగనన్న సురక్ష శిక్షణా తరగతులు



**కోట, జూన్ 17 ప్రభాతవార్త** కోట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులకు, పంచాయతీ కార్యదర్శులకు, వాలంటీర్లకు ఎంపిడిఓ మారెళ్ల భవాని జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10 రకాల సర్టిఫికెట్లను గతంలో పొందకుండా ఉంటే వాటిని జగనన్న సురక్ష శిబిరంలో అందేటట్లు చూడాల్సిన బాధ్యత ఆయా సచివాలయ కార్యదర్శులపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తారని చెప్పారు. ఆన్‌లైన్‌లో వివరాలు పొందాల్సి ఉందన్నారు. మండలంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ ఒక బృందంగా, ఎంపిడిఓ, ఇఓపిఆర్‌డి మరో బృందంగా ఏర్పడి 16 సచివాలయాల్లోని గృహసారధులు, వాలంటీర్లతో కలిసి పర్యవేక్షించి వివిధ పథకాలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు.

## ఎన్‌సిఆర్ పార్కును ఏర్పాటు చేయాలి

**కోట, జూన్ 17 ప్రభాతవార్త** కోటలోని బిసి బాలుర వసతి ప్రాంగణంలో దివంగత నేత, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పార్కును నిర్మించాలని ఆర్ఆర్ థియేటర్ సమీపంలోని ప్రజలు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు ఇక్కడ మాట్లాడుతూ ఎన్‌సిఆర్ పార్కును స్మృతివనం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నల్లపరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించిన మహానేత అని చెప్పారు. ఆ మహానేత పేదల హృదయాల్లో చిరస్థాయిగా ఉన్నారని చెప్పారు.

## సీఎం జగన్ పాలనపై ప్రజల్లో సంతోషం





– ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**ఓజిలి, జూన్ 17 ప్రభాతవార్త** అర్హత ప్రామాణికంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ప్రజలంతా సంతోషంగా ఉన్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఓజిలి మండలం పున్నేపల్లి, నెమళ్లపూడి గ్రామాల్లో శనివారం వైసీపీ నాయకులు పాదర్తి హరినాథరెడ్డి, ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక వైసీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన గడప గడపకు వెళ్లి రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు అందని వారి వివరాలు తెలియజేస్తే వారికి అందజేస్తామని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించి ప్రజలు రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాదర్తి హరినాథరెడ్డి, ఎస్ఐ డి.ఆదిలక్ష్మి, సురేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, ఎంపిడిఓ రజనీకాంత్, దేశిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, ఎంపిటిసి రఘురామరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ సుమన్‌రెడ్డి, ఆర్ఐ విజయకుమార్, ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, ప్రభాకర్‌రాజు, కుందాం సొసైటీ అధ్యక్షుడు రాజారాంరెడ్డి, జరుగుమల్లి బాబిరెడ్డి, దామోదర్‌రాజు, సురేష్‌రెడ్డి, వేణురెడ్డి, పిండుకూరు మధురెడ్డి, రాజారెడ్డి, మహేంద్రర్‌రెడ్డి, ఘట్టమనేని ప్రసాద్‌నాయుడు, వెంకట మణికంఠ కుమార్, వైస్ ఎంపీపీ ప్రసాద్‌నాయుడు, సుబ్బానాయుడు, ఏపీఎం, ఏపీవో ముమ్మడి సుబ్బారావు యాదవ్, నాయుడుపేట మండల జేసీఎస్ కన్వీనర్ ఒట్లూరు కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పున్నేపల్లి సర్పంచ్ పి.శేషమ్మ, రంగయ్య, ప్రసాద్ సిద్ధార్థ్, మోహన్, నెమళ్ల పూడి సర్పంచ్ ఈశ్వర్‌రాజు, రామచంద్రరాజు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**గూడూరు, జూన్ 17 ప్రభాతవార్త** మూడున్నర దశాబ్దాల తర్వాత నాటి విద్యార్థులు ఒక్కచోట కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆడారు, పాడారు. నాటి మధుర స్మృతులను, చిలిపి తగాదాలను గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబ సభ్యుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. గూడూరు పట్టణంలోని 1985–86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు జిల్లా ప్రజా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం కలుసుకున్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన మిత్రులందరూ అందరి పేర్లు, చిరునామాలు సేకరించారు. డాన్సులు, ఆటపాటలతో సరదాగా గడిపారు. కష్టసుఖాల్లో ఉన్న మిత్రులు ఆపదవేళ ఆదుకునేందుకు సహాయ నిధిని సమకూర్చేందుకు నిర్ణయించారు. అనంతరం జిల్లా ప్రాథమిక ఉన్నతపాఠశాలలో 1985–86లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగక్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులను, మిత్రులను తలుచుకొని నాటి తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. అనంతరం ఇటీవల పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్త విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష కార్యక్రమం పై సమీక్ష



**చిల్లకూరు, జూన్ 17, ప్రభాతవార్త** చిల్లకూరు ఎంపిడిఓ కార్యాలయం ఆవరణంలో శనివారం ఎంపిడిఓ గోపినాథ్ ఆధ్వర్యంలో పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు, వాలంటీర్లు గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు చేరవేయాలన్నారు. జనన మరణ ధృవీకరణ పత్రాలు కావాలన్న వారికి అందుబాటులో ఉంచాలన్నారు. కులం, ఇన్‌కం సర్టిఫికేట్లతో పాటు భూ సమస్యలు కూడా తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజలకు సేవ చేయడమే ముఖ్య లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహశీల్దార్ అజమతుల్లా ఖాన్, ఈఓఆర్డి దాసరి రాజమాణిక్యం, ఏఓ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులయిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పదకాలు

–జిల్లా వైసిపి అద్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



**వెంకటగిరి జూన్ 17 ప్రభాతవార్త** అర్హులయిన ప్రతి ఒక్కరికి సంక్షేమ పదకాలను అందజేస్తామని వైసిపి జిల్లా అద్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.శనివారం ఆయన నాలుగవ వార్డు సాలే కాలనీలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశం లో ఏరాష్ట్రంలో చేయని విదంగ సిఎం సంక్షేమ పదకాలను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేదవాడు ఆనంగా జివించడమే సిఎం జగన్ లక్ష్యమన్నారు. జీవితాతం సంక్షేమ పదకాలు అందాలంటే సిఎం గా జగన్ మోహన్ రెడ్డి ఉండాలని తెలిపారు. వీదిదీపాలు,రోడ్లు,పించన్లుతదితరసమస్యల సమస్యలను పరిష్కరించాలని అదికారులకు సూచించారు. కమీషనర్ వెంకట్రామయ్య,కౌన్సిలర్స్ ఎంఎ నారాయణ,సుబ్రారావు,వహీద, జానకీ రామయ్య ,లక్కమనేని కోటేశ్వరరావు,బాలయ్య,ప్రసాద్‌రెడ్డి,చిట్టేటి హరికృష్ణ,మురళీకృష్ణ, పాల్గొన్నారు.

## సీతా, రామ, లక్ష్మణ నూతన విగ్రహ ప్రతిష్ట



**చిల్లకూరు, జూన్ 17, ప్రభాతవార్త** మండలంలోని చిల్లకూరు శంకరగిరిజన కాలనీలో శనివారం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వారి ట్రస్టు సమరసేత సేవా పౌండేషన్ ఆధ్వర్యంలో సీతా, రామ , లక్ష్మణల నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. 10 లక్షల రూపాయిలతో నూతనఆలయ నిర్మాణం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమా నికిముఖ్యఅతిధులుగాగూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్, పెనుశిల లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, ప్రముఖ పారిశ్రామిక వేత్త తానంకి నానాజీలు విడివిడిగా పాల్గొని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరి రాకతో ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభాలతో స్వాగతం పలికి శాలువాలతో ఘనంగా సన్మానించారు. జడ్పిటిసి మన్యం శీనయ్య, సీనియర్ నాయకులు చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు రామూర్తి, దువ్వూరు చెంచుకిరణ్ రెడ్డి, వెదలపర్తి మనోజ్ కుమార్ రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ద్రవిడ ఉద్యోగులకు 3నెలల పాతవేతనాలు ..



అంగీకరించని ఉద్యోగులు

**కుప్పం, జూన్ 17 ప్రభాతవార్త** ద్రవిడ వర్శిటీలో నాలుగు నెలలుగా వేతనాలు లేక సమ్మె చేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల ఖాతాల్లో మూడు నెలల పాత వేతనాలను అధికారులు జమ చేశారు. అయితే తమకు పెంచిన వేతనాలు చెల్లించాలని సమ్మె విరమించేది లేదని ఉద్యోగులు స్పష్టం చేశారు. 11వ పిఆర్‌సి ప్రకారం పెంచిన వేతనాలు అందించాలని, 12 నెలల అరియర్లు ఇవ్వడంతో పాటు సిఎఫ్ఎంఎస్ ద్వారా వేతనాలు చెల్లించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్శిటీలో పరీక్షల నిర్వహణకు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పాత జీతాలను ఉద్యోగుల ఖాతాల్లో జమ చేశామని ఉద్యోగులు సమ్మె విరమించాలని రిజిస్ట్రార్ డా॥ వేణుగోపాల్‌రెడ్డి కోరారు. ఇందుకు ఉద్యోగులు అంగీకరించలేదు. కాగా సోమవారం చర్చించి కార్యాచరణ ప్రకటిస్తామని ఉద్యోగులు పేర్కొన్నారు.

## సచివాలయాలు మూసివేసి సమావేశాలు నిర్వహించాలా?

-సేవలకోసం ఇబ్బంది పడ్డ ప్రజలు



తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలపరిషత్ కార్యాలయం తీరు తీసికట్టుగా మారింది. శనివారం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా ఈనెల 23 నుంచి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 'జగనన్న సురక్ష' పథకంపై నిర్వహించిన సమావేశంపై ప్రజలు మండిపడ్డారు. సచివాలయాలకు తాళాలు వేసి ఇలా సమావేశాలు నిర్వహించాలా? అంటూ మండల అధికారులపై మండిపడుతున్నారు. శనివారం పలు పంచాయతీల్లో ఉన్న సచివాలయాల్లో సేవలకోసం వెళ్ళిన ప్రజలు సచివాలయాలకు తాళాలు వేసి ఉండడంతో వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. అసలు జగనన్న సురక్ష పథకం ఏంటి పజలకు ఏదైనా పత్రాలకు సంబందించి, సర్టిఫికెట్లలకు సంబందించి లేదా సంక్షేమపథకాలకు సంబందించి ఏవైనా సమస్యలు ఉంటే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు ఏదైనా పత్రాలకు సంబందించి, సర్టిఫికెట్లకు సంబందించి లేదా సంక్షేమ పథకాలకు సంబందించి సమస్యలు ఉంటే వాటిని సత్వరం పరిష్కరిస్తుంది. ప్రజలు ఫిర్యాదులకోసం ఇప్పటికే ఉన్నటువంటి జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా ఈ పథకం కొనసాగుతుంది. నెలరోజుల పాటు కొనసాగనున్న సురక్ష పథకం ద్వారా ప్రజల సమస్యలకు సంబందించి మండలాధికారులు క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ కె.సురేష్‌బాబు తెలిపారు. ముఖ్యంగా గ్రామాల్లో గ్రామసభల నిర్వహణకు రెండు బ్యాచ్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు రాని వారిని వాలంటీర్లు గుర్తించి వారి అర్హతలకు సంబందించి ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలుచేపడుతారన్నారు. ఈకార్యక్రమం ఈనెల 23 నుంచి జూలై 23 వరకు ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపిడిఓతో పాటు రీసర్వే డిప్యుటీతహశీల్దార్,ఇఓపిఆర్‌డితరుణాక్షరెడ్డి,పంచాయతీకార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుకాదేవికి బృందమ్మ పరామర్శ

శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త



తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకురాలు, రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక కార్యదర్శి బి.రేణుకాదేవి ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకున్నారు. దీంతో విషయం తెలుసున్న దివంగత నేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జలబృందమ్మ రేణుకమ్మనివాసానికి వెళ్ళి పరామర్శించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ఆరోగ్యం పైజాగ్రత్తగాఉండాలనితెలిపారు.బృందమ్మతోపాటు సుమతి, మల్లీశ్వరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధికూలీలకు రూ.272 వచ్చేలా పనులు చేయించండి

తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త



ఉపాధిహామీ కూలీలకు రోజుకు రూ.272లు కూలీ వచ్చేలా కొతలు ఇచ్చి పనులు చేయించాలని ఉపాధిహామీ పథక సంచాలకులు శ్రీనివాసప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని తొట్టంబేడు పంచాయతీలో జరుగుతున్న పెర్కులేషన్‌చెరువు పనులను తనిఖీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. సకాలంలో వేతనాలు ఖాతాల్లో జమఅవుతున్నాయా?లేదా? అని తెలుసుకున్నారు. ప్రస్తుతం వేసవిలో ఎలాంటి కూలీలకు వసతులు కల్పించాలన్నారు. అనంతరం కూలీలకు మజ్జిగను పంపిణీచేశారకు. ఆయనతో పాటు ఎపిఓ సుజాత, సిబ్బంది, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు భవిష్యత్తు

.శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త



ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పురపాలక సంఘ బాబు అగ్రహారం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్ప అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈసందర్భంగా పదోతరగ తిలో అత్యధిక మార్కులు సాధించిన కె.కుషిత(5 62), ఎస్‌కె.అమీన్(539), ఎస్‌కె.ఎం.ఎ.సుమయ సుల్తానా(526) మార్కులు సాధించారు.దీంతో విద్యార్థులను,తల్లిదండ్రులనుదుశ్శాలువతోసత్కరించిజగనన్నఆణిముత్యం ప్రశంసా పత్రంనుఅందించిసత్కరించారు.హెచ్ఎంతోపాటుఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలి

జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 17, ప్రభాతవార్త

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో ఎక్కడైనా మాతాశిశు మరణాలు జరగకుండా చూడాలని ఒక వేల జరిగితే అందుకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి హెచ్చరించారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీ హరి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయంలో మాతాశిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీ హరి, మాతాశిశు, మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులు, ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడి కార్యకర్తలు, వైద్యుల సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్య పరీక్షలు జరిపి తల్లి, బిడ్డల క్షేమానికి ప్రాధాన్యతలని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులల్లో జరిగే మాతృ మరణాలపై సంబంధిత బంధువులు వివరణలను పరిగణలోకి తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరి చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లాలో గత ఫిబ్రవరి మాసం నుండి ఏప్రిల్ వరకు ఒక మాతృ మరణం, ఆరు శిశుమరణాలు చోటు చేసుకున్నాయని, ప్రభుత్వ లక్ష్యం జీరో మరణాలని గుర్తించి పని చేయాలని అన్నారు. సమీక్షలో ఈ సమీక్షలో కమిటీ కన్వీనర్, జిల్లా వైద్య అధికారి డా. శ్రీహరి, డిఎల్ఎటిఓ అరుణ సులోచన, డిసిహెచ్ఎస్ మణి, డిఐఓ శాంతకుమారి, అనస్థిషియా నుండి డాక్టర్ రాధ, ఎమ్డీఆర్ నోడల్ అధికారి భువనేశ్వరి, బ్లడ్ బ్యాంకు అధికారి ప్రసన్న రాగూర్, చిన్న పిల్లల వైద్యులు రాజశేఖర్, డిపిఎంఓ శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఓలు సుధారాణి, హనుమంతరావు, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్ధసారధి, డెమో ఇంచార్జి బాబు, నెహ్రూ రెడ్డి, డిఐఓ సెక్షన్ సిబ్బంది, ప్రైవేటు ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

## టిప్పర్ ఢీకొని కిరణ్‌కుమార్ మృతి

రేణిగుంట, జూన్ 17 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో రేణిగుంట పుత్తూరు పాత రోడ్డు మార్గంపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్‌కుమార్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రేణిగుంట బుగ్గ వీధికిచెందిన కిరణ్‌కుమార్ గాజులమండ్యం సర్కిల్ పిల్లపాలెం వద్ద సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నారు. తన ద్విచక్ర వాహనంలో రేణిగుంటకు వెళ్లి సెల్‌ఫోన్ రిపేరు చేయించుకుని తిరిగి షాపుకు వస్తుండగా రేణిగుంట పుత్తూరు పాత రోడ్డు మార్గంలో వెనుక వైపు నుంచి టిప్పర్ వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలోకిరణ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. టిప్పర్ డ్రైవర్ పారిపోయే ప్రయత్నం చేయగా మర్రిగుంట ఎస్సీ కాలనీ చెందిన కొంత మంది యువకులు డ్రైవర్‌ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ ధర్మారెడ్డి యువకులను అభినందించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహన కార్యక్రమాన్ని వైద్య అధికారులు బాధ్యతగా చేపట్టాలి

డిఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా టిబి, ఎయిడ్స్, లెప్రసి అధికారి అరుణ సులోచనా దేవి

తిరుపతి కలెక్టరేట్, జూన్ 17, ప్రభాతవార్త



జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం క్రింద జిల్లాలో ఈ నెల 26 జూన్ నుంచి 16 జూలై వరకు చేపడుతున్న కుష్టు వ్యాధి నిర్ధారణ అవగాహనకార్యక్రమాన్ని బాధ్యతగా చేపట్టాలని డిఎంహెచ్‌ఓ శ్రీహరి, జిల్లా టిబి, ఏయిడ్స్, లెప్రసీ అధికారి అరుణ సులోచనా దేవి సంబంధిత వైద్య అధికారులను ఉద్దేశించి అన్నారు. శనివారం ఉదయం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కుష్టు వ్యాధి నిర్మూలన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు నిర్మూలన అధికారి మాట్లాడుతూ కుష్టు వ్యాధి గుర్తింపు కొరకు ఇంటింటి సర్వే కార్యక్రమం ఈ నెల 26 నుండి వచ్చే నెల జూలై 16 వరకు వైద్య శాఖ ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గృహ సందర్శన చేసి కుష్టు వ్యాధి లక్షణాలపై స్వీయ పరీక్ష చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, స్క్రీనింగ్ నిర్వహణ చేపట్టుటకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ వ్యాధి అంటువ్యాధి కాదని కొన్ని లక్షణాలను గుర్తించిన మేరకు ఈ వ్యాధి నిర్ధారణ చేయవచ్చని శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు పొడలు, లావుగా మారిన నొప్పితో కూడిన నరములు, కాళ్ల లేదా చేతులు కండరాలలో బలహీనతో చేతులు పాదాలు నరములతో తిమ్మిర్లు అనిపించడం నొప్పిగా అనిపించని పుండ్లు చేతులలో పాదాలలో ఉండడం, కళ్ళు పూర్తిగా మూసుకోలేకపోవడం, చెవి తమ్మెలు, మందంగా మారడం, చర్మంపై చెవి తమ్మేళపై బుడిపెలు ఉండడం లాంటి లక్షణాలు ఏమైనా ఉంటే వెంటనే పరీక్ష చేయించుకోవాలని ఈ పరీక్షల నిర్వహణ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఉచితంగా చేయబడి ఎండిటి ఎందులు అందజేయబడతాయని అన్నారు. కనీసం 6 నెలల నుండి గరిష్టంగా 12 నెలల చికిత్స తీసుకుంటే ఈ వ్యాధి పూర్తిగా నయం అవుతుందని అన్నారు. కుష్టు వ్యాధి గ్రస్తులకు కావాల్సింది వైద్యం ఒకటే కాదని, మనోధైర్యం కూడా కావాలని తెలిపారు. ఈ వ్యాధిని ప్రారంభదశలో గుర్తిస్తే అంగవైకల్యాన్ని నివారించవచ్చని, గృహ సందర్శన కార్యక్రమంలో సంబంధిత వైద్య అధికారులు నిబద్ధతతో పనిచేసి కుష్టు వ్యాధి రహిత జిల్లాగా తిరుపతిని మార్చుటకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఓ సుధారాణి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిని శాంత కుమారి, డిసిహెచ్ఎస్ మణి, మెటర్నిటీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్ధసారధి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 19న వేలం పాట

**పుత్తూరురూరల్, జూన్ 17 ప్రభాతవార్త:** పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని వీరప్పరెడ్డిపాళెంలోని అంకాళపరమేశ్వరి ఆలయానికి సంబంధించి సర్వే నెంబరు 13/6లో 2.40 ఎకరాల భూమి ఉందని, ఆ భూమికి సంబంధించి ఈ నెల 19వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తిరుపతి దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు ధరావవత్తు కింద రూ.10 వేలు చెల్లించాలన్నారు. వేలం పాట దారులకు లీజు కింద భూమిని ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

## ఓటర్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయండి.!

టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి



రామచంద్రాపురం, 17 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ నాయకులకు నిర్దేశించిన పంచాయతీలలో ఓటర్ వెరిఫికేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి అన్నారు. శనివారం సి.రామాపురం, కమ్మకండ్రిగ యూనిట్‌లలో బూత్, సెక్షన్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు 2024 ఎన్నికలలో టిడిపిని ఆధరిస్తారని అన్నారు. పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలలో వచ్చిన ఫలితాలే సాధారణ ఎన్నికలలో సైతం పునరావృతం కాగలవన్నారు. టిడిపి జాతీయ కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో సభలకు ప్రజల నుండి లభిస్తున్న విశేష ఆధరణే ఇందుకు నిదర్శనమన్నారు.టిడిపి నాయకులు జనార్ధన్ చౌదరి, చినబాబు, కొట్టే గిరిధర్ రెడ్డి, రావిళ్ళ గిరి, కొట్టే నరశింహారెడ్డి, రామిరెడ్డి, రవి, కుమార్, రమేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి చెవిరెడ్డి ఆర్థిక సాయం



ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి

చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త:

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మృతి చెందిన కుటుంబానికి ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆర్థిక సాయం చేసినట్లు ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని నరశింగాపురంకు చెందిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి రెండు రోజుల క్రితం శ్రీనివాస మంగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైనట్లు తెలిపారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచినట్లు తెలిపారు. ఈ విషయమై సమాచారం అందుకున్న చెవిరెడ్డి బాధిత కుటుంబానికి తనవంతు ఆర్థిక చేసినట్లు వివరించారు. ఈ మేరకు శనివారం ఎంపిపితో పాటు సర్పంచ్ చెంచురత్నం, వైసిపి చంద్రగిరి డివిజనల్ కార్యాలయ ఇన్‌చార్జ్ కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, పార్టీ నాయకుడు మించల ప్రవీణ్‌కుమార్, వార్డు సభ్యుడు నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

## శానంబట్ల శివగిరి వద్ద ఇసుక అక్రమ రవాణా

టిప్పర్ సీజ్ చేసిన ఎస్ఈఓ సిఐ లీలారాణి

చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త:

శానంబట్ల శివగిరి వద్ద శనివారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్‌ను ఎస్ఈబి సిఐ లీలారాణి సీజ్ చేశారు. తిరుపతి జిల్లా, ఎస్ఈబి అధికారి ఆదేశాల మేరకు శివగిరి వద్ద దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేసి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఎస్ఐ హిమబింధు కేసు నమోదు చేశారు.

## టిటిడి ఆలయాల్లో దాతల సహకారంతో అన్నప్రసాదం

-జెఇఓ వీరబ్రహ్మం



తిరుమల,జూన్ 17ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల తరహాలో తిరుపతి పరిసరాల్లోని ,ఇతర ప్రాంతాల్లో ఉన్న టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాదం వితరణకు దాతల సహకారం తీసుకోవాలని టిటిడి జెఇఓ వీరబ్రహ్మం కోరారు. శనివారం తిరుపతిలోని తన ఛాంబర్‌నుంచి వర్చువల్‌గా జెఇఓ సమావేశం నిర్వహించారు. చంద్రగిరి, తొండవాడ, ఒంటిమిట్ట, మంగళంపేట, బూరగమంద తదితర ఆలయాల్లో దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ జరగాలన్నారు. బయటి ప్రాంతాలకు వెళ్ళే యాత్రికులకు ఆయా ఆలయాల పనివేళలు, సేవలు గురించి తెలిసేలా సూచికబోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. ముఖ్యకూడళ్ళలో ఉంచాలన్నారు. ఆయా ఆలయాల్లో కల్యాణోత్సవంతోబాటు ఇతర సేవలను ప్రారంభించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు. ప్రతి ఆలయంలో శ్రీవారి సేవకులు, భక్తులద్వారా అభిప్రాయ సేకరణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ ఇఒలు గోవిందరాజన్, గుణభూషణ్‌రెడ్డి, విజయకుమార్ ,వరలక్ష్మి ,శాంతి, నటేష్‌బాబు, దేవేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

## కష్టం కన్నా సినిమాపై ఇష్టంతో పూర్తి చేశాం

-చిత్రం ఈనెల 30న విడుదల -నారాయణ అండ్ కో తిక్కల్ ఫ్యామిలీ వెల్లడి

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూన్ 17 ప్రభాతవార్త:



ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న చిత్రాన్ని పూర్తి చేయాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడాలని..ఈ విషయం నారాయణ అండ్ కో చిత్రంతో చవిచూశామని ఆ చిత్ర బృందం తెలిపింది.శనివారం స్థానిక లీలామహల్ కూడలి సమీపంలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో సుధాకర్,హీరోయిన్లు పూజ కిరణ్,యామిని,హాస్య నటుడు జై కృష్ణ,డైరెక్టర్ చిన్న పాపిశెట్టిలు మాట్లాడుతూ మంచి కెమెరాతో ఎక్కడా క్వాలిటీ మిస్ కాకుండా ఫ్యామిలీ మొత్తం నవ్వుకోగలిగిన చిత్రాన్ని రూపొందించామన్నారు.ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల చేతుల మీదుగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశామని,6 నుండి 60 ఏళ్ల వరకు వయసుగల ప్రతి ఒక్కరు చూడదగ్గ చిత్రమన్నారు. ఈనెల 30న విడుదల కానున్న ఈ చిత్రంలో సీనియర్ నటులు సప్తగిరి,ఆమని, దేవిప్రసాద్,తదితరులు నటించారన్నారు.

## రేపటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు

పుత్తూరు, జూన్ 17 ప్రభాతవార్త :

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 19వ తేదీ నుంచి బిఎ, బికామ్, బిఎస్సీ, బిబిఎ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయని కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020 నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుత 2023-2024 విద్యా సంవత్సరం నుంచి సింగిల్ మేజర్ సబ్జెక్టులతో కొత్త డిగ్రీ విధానాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని తెలిపారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బిఎ (ఎకనామిక్స్, బిఎస్సీ (మ్యాథమెటిక్స్), ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, బికామ్ (జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్), బిబిఎ డిగ్రీ కోర్సుల్లో సింగిల్ మేజర్ సబ్జెక్టులతో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యా బోధన, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్ట్, స్కిల్ డెవలప్‌మెంట్, స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్, లైఫ్ స్కిల్ కోర్సులు ప్రతి విద్యార్థి తప్పని సరిగా అభ్యసించేలా సబ్జెక్టులు వుంటాయని వివరించారు. ఎపిఎఎండిసి 2023-2024 వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకుని తద్వారా కాలేజీలో అడ్మిషన్లు పొందాలని లేదా కాలేజీ కార్యాలయంలో నేరుగా సంప్రదించి డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 9182136020, 8374556441, 9985313431, 7396650368 మొబైల్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

## అంధకారంలో పాతార్కాడు ఆదిఆంధ్రవాడ

విజయపురం, జూన్ 17 ప్రభాతవార్త :

మండలంలోని పాతార్కాడు ఆదిఆంధ్రవాడ అంధకారంలో వుందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుకు గురి కావడంతో రెండు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు

## కష్టాల్లో కనబడరు: ఓట్ల కోసం వస్తారు:జాగ్రత్త

ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి జనం కష్టాల్లో ఉన్నపుడు నాయకులు కనబడరు.ప్రకృతి వైపరీత్యాల్లో ఆదుకోరు. ఐదేళ్ళ కొకమారు ఓట్ల కోసం వస్తారు. కల్లబొల్లి కబుర్లు చెబుతారు.మిమ్ముల్ని మోసం చేస్తారు. అరచేతిలో స్వర్గం చూపుతారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. శనివారం ఆయన శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు పంచాయతీలోని అంజనేయ పురం,మాధురి పల్లి, పోలి పంచాయతీలోని వాంపల్లిలలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు ఇంటింటా ఘన స్వాగతం పలికారు. యువకులు ఉత్సాహంతో సంబరాలు జరుపుకుంటూ స్వాగతం చెప్పారు. భారీ ఎత్తున బాణ సంచాను కాలుస్తూ నృత్యాలు చేస్తూ హారతులిస్తూ స్వాగతించారు. ఎంఎల్ఏ ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయా? లేదా? అని వాకబు చేస్తూ రావట లేదనే వారికి ఎందుకు ప్రభుత్వ సహాయం అందటం లేదని అధికారులను వాకబు చేస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంఎల్ఏతో పాటు సర్పంచ్ చెలికం నాగరాజరెడ్డి,పుల్లూరు ఆశోక్‌రెడ్డి, పోలి గుణ, నాగోలు శ్రీనివాసులురెడ్డి, జయప్రకాష్,రామనాధనాయుడు, తిరుపాల్‌నాయుడు,సురేంద్రయాదవ్,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ ఎఈఈగా ఆలీ

.తొట్టంబేడు, జూన్ 17 ప్రభాతవార్త



తొట్టంబేడు మండల హౌసింగ్ ఎఈఈగా శ్రీకాళహస్తి మండల ఎఈఈగా పనిచేస్తున్న ఆలీని నియమించారు. దీంతో ఆయన శనివారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎఈఈగా పనిచేస్తున్న సుబ్రమణ్యం శ్రీకాళహస్తి మండలానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎఈ ఆలీ మాట్లాడుతూ మండలంలో హౌసింగ్ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు తన వంతు సహకారం చేస్తామని వివరించారు.

# తిరుపతి డివిజన్

## జనసేన నేత చంద్రబాబును అరెస్టు చేయించడం దుర్మార్గం

-తెదేపా ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి



.శ్రీకాళహస్తి, జూన్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంఎల్ఏ నీచరాజకీయాలు చేస్తున్నారని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం అక్రమంగా అరెస్టుచేసిన జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోట భర్త చంద్రబాబును పరామర్శించేందుకు సబ్‌జైలుకు వెళ్ళి పరామర్శించి మాట్లాడారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసిపిని గెలిపిస్తే ఇంట్లో మనుషులు, నగలు, నగదు కూడా మిగలదని ఎద్దేవాచేశారు. రాబోవు రోజుల్లో ఉమ్మడిగా పోరాడి వైకాపా ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామన్నారు. అన్యాయంగా అరెస్టుకాబడిన చంద్రబాబు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వినుత కోట ఇంటికి వెళ్ళి పరామర్శించి ఆమెకు ధైర్యం చెప్పారు. శ్రీకాళహస్తిలో జరిగే సంఘటనలు చూస్తే బాధ కలుగుతోందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా శ్రీకాళహస్తి ఎంఎల్ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు ఏతప్పు చేయలేదని గాజులమండ్యం సిఐ ఆరోహణరావు ముందస్తు ప్రణాళికతో ఎంఎల్ఏ బొయ్యపుమధుసూదన్‌రెడ్డి చేసుకున్న లోపాయికారి ఒప్పందం మేరకు జనసేన నేత చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించారన్నారు. ఈ అక్రమ కేసులు, అరాచకాలు పోవాలంటే వచ్చే ఎన్నికల్లో నారాచంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలని, శ్రీకాళహస్తిలో తనను ఎంఎల్ఏగా గెలిపించాలని కోరారు. సమావేశంలో టిడిపి పట్టణాధ్యక్షులు విజయకుమార్, మాజీ మార్కెట్ కమిటీఛైర్మన్ రంగినేని చెంచయ్యానాయుడు, తిరుపతి పార్లమెంటు కోశాదికారి కంటా.రమేష్, ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, వజ్రం కిషోర్, ప్రతాప్‌రెడ్డి, షాకిరాలీ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), రామకృష్ణయాదవ్, కిట్టు, వినయ్, సుజిత్, రామకృష్ణ, లక్ష్మణ్, అనిల్, సురేష్, జమీద్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి అద్దాలు పంపిణీ



నగరి, జూన్ 17 ప్రభాతవార్త:

మంత్రి క్యాంప్ కార్యాలయంలో శంకర నేత్రాలయం, రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా కంటి వైద్య చికిత్స ఆపరేషన్ చేయించుకున్న అభ్యర్థులకు శనివారం ఉచితంగా 150 మందికి కంటి అద్దాలను పంపిణీ చేసి మధ్యాహ్నం భోజనం మంత్రి రోజా భర్త సెల్వమణి అందజేశారు. కార్యక్రమంలో నగరి ఛైర్మన్ నీలమేఘం, పుత్తూరు ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ బాలన్, శంకర్, వైస్ ఎంపీపీ ఢిల్లీబాబు, బుజ్జిరెడ్డి, బాలకృష్ణ, శివరాజు, ఆనందన్, కృష్ణమూర్తి, తిరుమలరెడ్డి,సలీం, చిన్న దొర, సర్పంచ్ రవి, జగదీష్, మురుగయ్య, మునస్వామి, సతీష్, వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చింతలపట్టెడలో జనభాగీదారి



నగరి, జూన్ 17 ప్రభాతవార్త:

మున్సిపల్ పరిధి చింతలపట్టెడ దళితవాడలో సీడీపీవో కృష్ణవేణి అధికారులు శనివారం జనభాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీలో ప్రీ స్కూలు ద్వారా జరిపే వివిధ కార్యక్రమాల గురించి ఆమె అవగాహన కల్పించారు. చిన్నారులకు ఆట, పాట, మాట, కథ, సంసిద్ధత, సృజనాత్మకత, లోపలి, బయట ఆటలు తదితర కార్యక్రమాల ద్వారా 3 నుంచి 5 సంవత్సరాల లోపు విద్యార్థులు సమగ్ర అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

పుత్తూరురూరల్, జూన్ 17 ప్రభాతవార్త:



మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మామిడి కాయలను రోడ్డుపైపోసి నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డి.మమేష్ పుత్తూరు పట్టణంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని పుత్తూరు మండలంలోని అడవి కండ్రిగ గ్రామంలో మామిడి రైతులతో పంటకు మామిడి కాయలను రోడ్డుపై నేల పాలు చేశారు. ఒక పక్క గాలివానతో మామిడి కాయలు రాలిపోతూ నష్టం చేకూరుస్తా ఉంటే మరో పక్క కాయలకు గిట్టుబాటు ధర లేక యాజమాన్యాలు అతి చౌకైన అడుగుతున్నారని పంటలోకోయడానికి కూలీలు కూడా ధర పలకడం లేదని రైతులు ఆవేదన చెందారు. ఇప్పటికైనాపై అధికారులు వెంటనే వాటిపై చర్యలు తీసుకోవాలని రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మోహన్‌రాజు, ప్రేమానంద్‌రాజు, కేశవులు, వెంకటేశులు, సుబ్రహ్మణ్యంరాజు, సెల్వరాజ్ ఆచారి, రవి, భాస్కర్, రమేష్, కృష్ణారెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పశు బీమా పథకం సద్వినియోగం చేసుకోండి

వడమాలపేట, జూన్ 17 ప్రభాతవార్త:



పాడి పశువులు, గొర్రెల మేకల మీద ఆధారపడి జీవించే రైతులు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ పశు బీమా పథకంను సద్వినియోగం చేసుకోవాలని వడమాలపేట పశు వైద్యాధికారి మురళీధర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త బీమా పథకంపై రైతులకు అవగాహన కల్పించేందుకు శనివారం టీసీ అగ్రహారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుకోకుండా పాడి పశువులను రైతులు కోల్పోతే, వారు ఆర్థికంగా నష్టపోయి ఆవేదనకు గురవుతున్నారని దీని నుంచి విముక్తి కలగడానికి ప్రభుత్వం సబ్సిడీ మీద వైఎస్ఆర్ పశు బీమా పథకం తేవడం జరిగిందన్నారు. రైతు వాటాగా 20 శాతం చెల్లిస్తే ప్రభుత్వం 80 శాతం చెల్లిస్తుందన్నారు. పాడి ఆవు, గేదెలకు 30 వేలు బీమా చేసుకుంటే ఎస్టీ, ఎస్సీ ఆర్థికంగా వెనుకబడిన వారు రూ.384లు, మిగిలిన వారు 960 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ బీమా మూడు సంవత్సరాలు కాల పరిమితి ఉంటుందన్నారు. అదే గొర్రెలు, మేకలకు ఏడాది కాల పరిమితికి ఎస్టీ, ఎస్సీ, ఆర్థికంగా వెనుకబడిన వారు 36 రూపాయలు, మిగిలిన వారు 90 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. దీనిని ప్రతి ఒక్క పాడి రైతు ఉపయోగించుకోవాలని కోరారు. పశు సంవర్ధకశాఖ సిబ్బంది, మీ గ్రామానికి విచ్చేసినప్పుడు వారికి సహకరించి మీ పశువులకు బీమా చేసుకోవాల్సిందిగా కోరారు.లైవ్ స్టాక్ ఆఫీసర్ లోకనాథం, పశు వైద్య సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

## జూడో రాష్ట్ర పోటీలను ప్రారంభించిన ఎఎస్పి

తిరుపతి (క్రీడా), జూన్ 17, ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ఓపెన్ కేడెట్ జూడో పోటీలను సాయంత్రం 5 గంటలకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్, తిరుపతి నందు ముఖ్య అతిధి ఎఆర్ అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణ రెడ్డి, అతిధులు డాలర్స్ దివాకర్ రెడ్డి, రాష్ట్ర ఒలంపిక్ సంఘం కార్యదర్శి పురుషోత్తం, జెన్ అకాడమి రాజేష్, భానుప్రకాష్ రెడ్డి,ఏపి జూడో సంఘం అధ్యక్షులు ఆనం రామ కిషోర్ రెడ్డి, కార్యదర్శి బద్దుల శ్రీధర్, జెఎఫ్ఐ అబ్జర్వర్ ఉమేష్ కుమార్ సింగ్, ఒలంపిక్ జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, కార్యదర్శి శ్రీధర్, కాంప్లెక్స్ ఎవో సయ్యద్ సిఐఓకెఎన్ బాబు, సిఐ చంద్రశేఖర్‌లు ప్రారంభించారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించిన వారు జూలై 5 నుండి 10 వరకు కర్ణాటకలో జరుగు జాతీయ స్థాయి పోటీలలో మంచి ప్రతిభ చూపి రాష్ట్రానికి మంచి పేరు తీసుకుని రావాలని ఎఎస్పి లక్ష్మి నారాయణ రెడ్డి అన్నారు. క్రీడల అభివృద్ధికి ఒలంపిక్ సంఘం కృషి చేస్తుందని ఎపి ఒలంపిక్ సంఘం అధ్యక్షులు పురుషోత్తం అన్నారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు క్యాంప్ నిర్వహించి జాతీయ స్థాయికి పంపుతామని అధ్యక్షులు రాజేష్, ఉపాధ్యక్షులు భాను ప్రకాష్ రెడ్డి అన్నారు. రేపు క్రీడాకారులకు మెడల్స్ బహుమతి ఉంటుందని కిరణ్ కుమార్ అన్నారు. రాష్ట్రం మొత్తం 160 మంది బాల బాలికలు పాల్గొన్నారు.

## సమర్ధవంతంగా "జగనన్న సురక్ష" అమలు

ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా



చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "జగనన్న సురక్ష" కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సచివాలయ ఉద్యోగులకు జగనన్న సురక్ష కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి చేతులమీదుగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని సచివాలయాలను రెండు గ్రూపులు విభజించి ఒక గ్రూప్‌కు ఎంపిడిఓ, డిప్యూటీ తహశీల్దార్, మరో గ్రూప్‌కు తహశీల్దార్, ఈఓపిఆర్‌డి శశిరేఖ పర్యవేక్షిస్తారని అన్నారు. ఈ నెల 24 నుండి నెల రోజుల పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, అధికారులు ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఇందులో భాగంగా గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు సచివాలయం ద్వారా లభించే 534 సేవలను వివరించాలన్నారు. ప్రజల నుండి వచ్చే వినతుల పరిష్కారం ఏ స్థాయిలో వున్నదనే అంశాలను ఇంటింటికీ వెళ్ళి ప్రజలకు వివరించాలన్నారు. నెల రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు.

**CHENGE OF NAME**

I (OLD NAME) SHAIK NAMETHULLAH S/O. SHAIKABDULAZEEM CHANGE MY NAME AS (NEWNAME)SHAIK NYAMATHULLA S/O. SHAIK ABDUL AZEEM RESIDING AT 2/799 ANANDA NAGAR T.SUNDUPALLI,ANNAMAYA Dist., A.P. MY PASSPORT NO : F6321620

## తిరుచ్చి వాహనంపై 'దేవేరులతో కల్యాణ వెంకన్న'



చంద్రగిరి, జూన్ 17 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం తనదేవేరులు శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు దేవేరులతో తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ తేనెపల్లి వెంకటస్వామి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు డి.వి.మురళికృష్ణమాచార్యులు, అధ్యాపక సంతాన కృష్ణన్, డాక్టర్ ఉదయ్‌తేజ, ఘనాపాటి తిరువెంగడం, జమేదర్ రమణయ్య, ఆలయ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, జూన్ 17 ప్రభాతవార్త: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం శ్రీనివాసునికి ఊంజల్‌సేవ, గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని సర్వ భరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ శ్రీవారి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన స్వామివారు ఉభయ దేవేరులతో పాటు తిరుచ్చి వాహనంపై కొలువుదీరి మేళాతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో ఊరేగారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్, రమణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం

శ్రీకాళహస్తి,జూన్ 17 ప్రభాతవార్త

శ్రీ కా ళ హ స్తీ శ్వరాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామి అ మ్మ వా ర్ల గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం నుంచి పూజలందుకున్న స్వామి అమ్మవార్లను రాత్రి అలంకార మండపంలో చక్కగా అలంకరించారు. బోయిలు మోసుకుంటూ గ్రామోత్సవానికి తరలించారు. మొదట ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పూజలు జరిపి మొక్కుకున్నారు. తరువాత రెండవ గేటు గోపురం నుంచి రాజగోపురంలోంచి వాహనాల మండపం తేరువీధి, నెహ్రూవీధి,నగరి వీధి, బజారువీధిలో ఊరేగింపు జరిగింది.





